రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలని సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీల మాదిరిగానే గాజువాక నియోజకవర్గంలో తాను కూడా ఏదో విధంగా విజయం సాధించాలన్న కోరికతో ప్రస్తుత టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గత ఎన్నికల్లో ఎడాపెడా హామీలిచ్చారు. ఆ హామీలను నమ్మి జనం ఓట్లు వేయడంతో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచారు. తీరా టీడీపీ అధికారంలోకి వచ్చి వందరోజులైనా రాష్ట్రంలో సూపర్ సిక్స్ హామీలు, గాజువాకలో పల్లా శ్రీనివాసరావు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. ఫలితంగా ఇక్కడి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దర్శనమిస్తున్నాయి. – గాజువాక

వంద రోజుల పాలన.. హామీల అమలు సున్నా

- లెక్కలేనన్ని హామీలిచ్చిన పల్లా
- ఒక్క హామీని నెరవేర్చలేని వైనం
- నియోజకవర్గ ప్రజల్లో అసంతృప్తి

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై చేతులెత్తేశారా?



స్టీల్‌ప్లాంట్ కార్మికుల నిరసన దీక్ష శిబిరం వద్ద ప్రసంగిస్తున్న పల్లా శ్రీనివాసరావు (ఫైల్)

'విశాఖ ఉక్కు... ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగుతోంది. మూడున్నరేళ్ల క్రితం ప్రైవేటీకరణ ప్రకటన వెలువడిన వెంటనే ఆమరణ నిరాహారదీక్షకు పూనుకొని కార్మికులను తనవైపు ఆకర్షించిన పల్లా శ్రీనివాసరావు ఈ ఎన్నికల్లో తాను గెలిచిన వెంటనే పరిరక్షణ చర్యలు ప్రారంభిస్తానని కార్మికులకు, ప్రజలకు హామీ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు కూడా న్యాయం చేస్తానని, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా న్యాయం చేస్తామని చెప్పారు. ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల్లో ధ్వంసం చేస్తోంది. ఇది ప్రైవేటీకరణ జరిగితే తాను రాజీనామా చేస్తానని చెప్పడం తప్ప ఇంకేమీ చేయలేకపోతున్నారు. దీంతో ఆయన చేతులెత్తేశారా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

గంగవరం తరలింపు ఊసేది?



తనకు అధికారం ఉంటే ఒక్క సంతకంతో గంగవరం గ్రామాన్ని తరలిస్తానని 2018 మే18న గంగవరంలో హామీ ఇచ్చిన పవన్‌కల్యాణ్ (ఫైల్)

గంగవరం పోర్టు కాలుష్యంతో గంగవరం మత్స్యకారులు అనేక దుష్ప్రభావాలకు గురవుతున్నారు. ఈ కారణంగా తమ గ్రామాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. గంగవరం గ్రామంలో కాలుష్యాన్ని అరికడతామని, లేదా గ్రామాన్ని తరలిస్తామని పల్లా శ్రీనివాసరావు ఎన్నికల హామీ ఇచ్చారు. గెలిచిన తరువాత ఆ విషయం ప్రస్తావన లేకుండా పోయింది.

రహదారుల విస్తరణ ఎక్కడ?



గాజువాకలో రోడ్ల పరిస్థితి ఇలా..

గాజువాకలో పెరిగిపోతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని వివిధ రహదారులను విస్తరించడంతో పాటు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కణితి రోడ్ విస్తరణ సగంలో నిలిచిపోయింది. వడ్లపూడి ప్రధాన రహదారి శిథిలావస్థలో ఉంది. వుడా డబుల్ రోడ్‌లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. దువ్వాడ స్టేషన్ రోడ్ అభివృద్ధి అతీగతీలేకుండా పోయింది. జాతీయ రహదారి పొడవునా సర్వీస్ రోడ్ ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది. షీలానగర్ నుంచి లంకెలపాలెం వరకు జాతీయ రహదారిపై గోతులు లేకుండా చేస్తామన్నారు. ప్రస్తుతం అడగడుగునా గోతులతో నరకం కనిపిస్తోన్న విషయం తెలిసిందే.

టోల్‌గేటు తొలగించినా..

తాను గెలిచిన నెల రోజుల్లో అగనంపూడి టోల్‌గేటు తొలగిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మూడు వారాల్లో టోల్ గేటును అనధికారికంగా తొలగించారు. దాన్ని అధికారికంగా తొలగించాలని ఇప్పటికీ సంబంధిత అధికారులకు లేఖలు ఇస్తున్నారు తప్ప కేంద్ర ప్రభుత్వం నుంచి మాత్రం సానుకూలత లభించడం లేదు. దీంతో టోల్‌గేటును మళ్లీ ఏర్పాటు చేస్తారా అనే ప్రశ్నలకు సమాధానం దొరకని పరిస్థితి.

ఎన్నెన్నో హామీలు

- ఏపీఐఐసీ నిర్వాసితులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీపై ఇప్పటికీ చర్యలు చేపట్టలేదు.
- పారదర్శక విధానం ద్వారా అందరికీ ఇసుక అందిస్తామన్నారు. ప్రస్తుతం ఇసుక డిపోలో ఇసుకే లేకుండా పోయింది. నిర్మాణదారులు అవస్థలకు గురవుతున్నారు.
- కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందిస్తామన్న హామీ కార్యరూపం దాల్చలేదు.
- డ్వాక్రా మహిళలకు బజారు ఏర్పాటు చేస్తామన్న హామీ దిక్కులు చూస్తోంది.
- షీలానగర్‌లో 500 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పినప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు.
- వరద నీటితో ముంపు భయం లేకుండా చేస్తామన్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా చాలాచోట్ల ముంపు భయపెడుతోంది.
- కొండవాలు ప్రాంతాల రక్షణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మిస్తామన్నారు. ఇప్పటివరకు ఒక్క వాల్ నిర్మాణం కూడా ప్రారంభం కాలేదు.
- యారాడ బీచ్‌ను మోడల్ బీచ్‌గా తీర్చి దిద్దుతామన్న హామీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- ఎన్నికల సమయంలో నిర్వహించిన ప్రచారం సందర్భంగా వీధి దీపాలు సరిగా లేకపోవడంతో అప్పటి ప్రభుత్వంపై ఆయన విమర్శలు సంధించారు. తాను గెలిచిన తరువాత ప్రతి వీధిలో విద్యుద్దీపాలతో వెలుగు రప్పిస్తానన్నారు. ఆ హామీకి అతీగతీ లేకుండా పోయింది.
- గాజువాకలో మార్కెట్లను ఆధునికీకరిస్తామన్న హామీ ఇప్పుడు వినిపించడం లేదు.
- ఆదర్శ గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఆ విషయంలో అడుగు ముందుకు పడలేదు.
- గాజువాకలో రోడ్లపై లారీలు, భారీ వాహనాలను నిలిపివేస్తుండటంతో తరచు ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి. విశాలమైన స్థలంలో ట్రక్ టెర్మినల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆ దిశగా చర్యలు ప్రారంభం కాలేదు.
- గాజువాకలో నైట్ షెల్టర్లు ఏర్పాటు చేస్తామన్న హామీ కూడా గాలిలో కలిసిపోయినట్టు కనిపిస్తోంది.



ఇటీవల వర్షాలకు శ్రీరామ్‌నగర్ కొండవాలులో జారిపడ్డ ఇంటి రక్షణ గోడ (ఫైల్)

హామీలన్నీ అమలు చేయాలి



చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో పాటు పల్లా శ్రీనివాసరావు కూడా గాజువాక నియోజకవర్గంలో సమస్యలపై చాలా హామీలు ఇచ్చారు. వాటిలో ఇప్పటివరకు ఒక్కటి కూడా అమలు చేయలేదు. వంద రోజుల పాలన పూర్తి చేశారు. కానీ ప్రజలకు ఏమీ ఒరగలేదు. గాజువాక సమస్యలపై ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి. – నక్క రమణ, పెదగంట్యాడ

స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు అన్యాయం



తాను గెలిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తానని చెప్పారు. ఇప్పుడు స్టీల్‌ప్లాంట్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్లాంట్‌ను గాని అమ్మేస్తే నిర్వాసితులు అన్యాయమైపోతారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించడంతో పాటు నిర్వాసితులకు న్యాయం చేయాలి. – చిన్నబాబు, వడ్లపూడి

రోడ్లు దారుణంగా ఉన్నాయి



గాజువాకలో రోడ్లన్నీ దారుణంగా మారిపోయాయి. ఎక్కడ చూసినా గోతుల మయమే. రాకపోకలు సాగించడం చాలా కష్టంగా ఉంది. తాను గెలిస్తే రోడ్లను విస్తరించి అభివృద్ధి చేస్తానని పల్లా చెప్పారు. గెలిచి పాలన ప్రారంభించి, వందరోజులు పూర్తయినా ఒక్క రోడ్డును కూడా అభివృద్ధి చేయలేదు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. – మురాల భరత్, గాజువాక

'ఉక్కు' పరిరక్షణ హామీ నిలబెట్టుకోవాలి



తనను గెలిపిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతానని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఆయన హామీని నమ్మి ఓట్లు వేశాం. కానీ ఆ దిశగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మరో పక్క కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విషయంలో మొండిగా ముందుకు వెళ్తోంది. దీనివల్ల ప్లాంట్ పరిస్థితి దయనీయంగా మారిపోయింది. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే తాను రాజీనామా చేస్తాననే ప్రకటనలు కాకుండా దీన్ని కాపాడటానికి ఎమ్మెల్యే నడుం బిగించాలి. – ఎన్.రమేష్ కుమార్, ఉక్కునగరం

ఆటలు చదువులో అంతర్భాగం కావాలి



యోగా పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం నాగేశ్వరరావు



ఖోఖో పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం రౌతు, నాగేశ్వరరావు



ఖోఖో పోటీల విజేతలతో నిర్వాహకులు

అగనంపూడి : ఆటలు చదువుతో పాటు జీవితంలోనూ అంతర్భాగం కావాలని లంకెలపాలెం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు అన్నారు. ఎస్‌జీఎఫ్ పరవాడ మండల స్థాయి ఖోఖో, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పరవాడ మండలం నుంచి 12 హైస్కూళ్లకు చెందిన 360 మంది విద్యార్థులు పాల్గొని వారి సత్తా చాటారు. వీరిలో గెలుపొందిన జట్లు వచ్చే డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్రిగ్ పోటీల్లో పాల్గొంటారని, ఎంపిక చేసిన క్రీడాకారులు ఈ నెలాఖరున నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఫిజికల్ డైరెక్టర్లు పి.లక్ష్మి, బి.అన్నాజీరావు, తులసీ సత్యవతి, శ్రీదేవి, ఎన్.వి.రమణ, రౌతు దేవి, కర్రి అమ్మాజీ, శ్రీలక్ష్మి, దేముడుబాబు, గౌరీ, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే మానవాళికి మేలు



రోడ్లను శుభ్రం చేస్తున్న ఎంఎస్‌ఎంఈ అధికారులు, పారిశ్రామికవేత్తలు

అక్కిరెడ్డిపాలెం : ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఆటోనగర్ డి–బ్లాక్‌లోని విశాఖ ఎలక్ట్రోడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పలుచోట్ల మొక్కలు నాటారు. రోడ్లను శుభ్రపరిచి స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రోడ్స్ లిమిటెడ్ యజమాని శేషగిరిరావు మాట్లాడుతూ చెట్లను కాపాడితే మానవాళికి ఎంతో మంచిదన్నారు. మన చుట్టు ఉండే పరిసరాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎంఎస్‌ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ బి.ప్రభాకర్ కుమార్, ఏడీ వీరయ్య, రేవతి, వినోద్, హీరో వర్మ, సుబ్బారావు, సన్యాసిరావు, కుమార్, వాసేవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కె.సత్యనారాయణ, బి.సత్యనారాయణ, జోగిరాజు, జగదీష్‌రావు, సీహెచ్ నూకరాజు, అల్లు సత్యనారాయణ రాజు, కృష్ణ ప్రసాద్, డి.వినోద్, ప్రశాంత్, ప్రభాకర్, వై.సాంబశివరావు, జె.వి.సత్యనారాయణ, కుంచమాంబ కాలనీ నాయకుడు పప్పు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి విశేష పూజలు

- మండపాల్లో అన్న సమారాధనలు



నాతయ్యపాలెంలో వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: గణపతి ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పలు మండపాల వద్ద శుక్రవారం అన్న సమారాధనలు నిర్వహించారు. ముందుగా విఘ్నాధిపతికి విశేష పూజలు చేశారు.

- 69వ వార్డు నాతయ్యపాలెంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, మహిళా అధ్యక్షురాలు కమరున్నీసా బేగం, రామిరెడ్డి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.
- కాపుతుంగ్లాం శివాలయం వద్ద జరిగిన అన్నసమారాధనను గ్రామ నాయకులు కరణం ముత్యాల నాయుడు, కంచిపాటి ప్రకాష్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో అక్కిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- 68వ వార్డు మిందిలో ఏఎంఎంసీ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వి.శేఖర్, తారక, జి.వి.ప్రసాద్, గిరి, నవీ తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో..



87వ వార్డులో అన్న సమారాధనను ప్రారంభిస్తున్న కోమటి శ్రీనివాసరావు

అగనంపూడి: 87వ వార్డు అప్పికొండ శెట్టిబలిజ కాలనీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద శుక్రవారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు ప్రారంభించారు. ద్వారంపూడి బ్రహ్మం, పోలవరపు గోవింద్, సారిపల్లి దేముడు, వెంకటేశ్వర్లు, జె్రిపోతుల ఈశ్వరరావు, సారిపల్లి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అల్జీమర్స్‌పై అవగాహన



డాక్టర్ విజయ్

అక్కిరెడ్డిపాలెం : అల్జీమర్స్ అనేది ఒక మతిమరుపు జబ్బు అని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ విజయ్ కుమార్ అన్నారు. ప్రపంచ అల్జీమర్స్ దినం సందర్భంగా శుక్రవారం ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధితో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 60 మిలియన్ల మంది బాధపడుతున్నారన్నారు. 65 సంవత్సరాల వయసు దాటిన ప్రతి 9 మందిలో ఒకరు ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉంటే ఈ వ్యాధిని అదుపు చేయవచ్చన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో ముగిసిన 'సీసీక్యూసీ-2024'



విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించిన చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ సర్కిల్ కాన్సెప్ట్స్–2024 (సీసీక్యూసీ) శుక్రవారం ముగిసింది. క్వాలిటీ సర్కిల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో జరిగిన కన్వెన్షన్ ముగింపు కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎన్. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మంచి భవిష్యత్తును సృష్టించుకోవాలంటే, వర్తమానంలో మనం ఉత్తమంగా పని చేయాలన్నారు. లీన్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాల్లో ఒకటిగా ఫైవ్ ఎస్‌ను అమలు చేసిన మొదటి పీఎస్‌యూ విశాఖ స్టీల్‌ప్లాంట్ అన్నారు. గతేడాది సుమారు 2310 క్వాలిటీ సర్కిల్ ప్రాజెక్టులు అమలు చేయడం ద్వారా రూ.15 కోట్లు పొదుపు అంచనా వేసినట్లు చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్, రియర్ అడ్మిరల్ ఆర్.విజయశేఖర్, కమోడర్ సంజయ్‌కుమార్, ఎన్‌టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, కోరమండల్ హెడ్ జ్ఞాన సుందరం, స్టీల్‌ప్లాంట్ సీజీఎం జి.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మంచి అలవాట్లతోనే ఉన్నతి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో

పెదగంట్యాడ: విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలని మండల విద్యా శాఖాధికారులు కె.రమణాజీ, ఇ.శ్రీనివాస్, న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ దాలిబాబు సూచించారు. 'సే నో టు డ్రగ్ – చైల్డ్ అబ్యూజ్' అంశంపై బెస్ట్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మట్లాడారు. చెడు వ్యసనాలకు బానిసలై భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సీహెచ్ దేముడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాలతి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఘనంగా హిందీ దివస్

అగనంపూడి : హిందీ దినోత్సవం సందర్భంగా 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు పలు ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రాష్ట్రీయ భాషగా హిందీకి ప్రాధాన్యత ఉందన్నారు. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా హిందీ తెలిసి ఉంటే సులభంగా వెళ్లి రావచ్చన్నారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు భానుమతి, శిరీష, శశికళ, ఇన్‌చార్జి అరుణ, ఫిజికల్ డైరెక్టర్ మన్నాజీ, నారాయణరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛతా హీ సేవా

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ అరబిందో పాఠశాల విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 'స్వభావ స్వచ్ఛత –సంస్కార స్వచ్ఛత' అనే థీమ్‌తో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉండటంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడటం వల్ల మంచి వాతావరణం, మెరుగైన ఆరోగ్యం లభిస్తాయన్నారు. విద్యార్థులు పాఠశాల ప్రాంగణం నుంచి కణితి బస్టాప్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల లోపల, పరిసరాల్లో ఉన్న వృథా వస్తువులను తొలగించారు. కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్త టి.ఎల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ జోసెఫ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి వార్డు సమస్యలు



కమిషనర్ సంపత్ కుమార్‌కు సమస్యలు విన్నవిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

గాజువాక : జీవీఎంసీ 65వ వార్డులోని 12 ప్రధాన సమస్యలను ఆ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వార్డు మొత్తం కొండవాలు ప్రాంతాలతో నిండి ఉందని, ఇక్కడ ఏళ్లనాటి నుంచి ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

76వ వార్డు సమస్యలపై వినతి

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న పార్కు గ్రీనరీ కోసం పైప్‌లైన్ సదుపాయం కల్పించాలని, స్వతంత్ర నగర్‌లోని శ్మశానవాటికను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించారు. పోర్టు రోడ్డును ఆనుకొని ఉన్న కాలనీల్లో రోడ్లు, కాలువలను అభివృద్ధి చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు పౌర సన్మానం

అగనంపూడి : విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో సేవలందించి విశాఖ విచ్చేసిన 79, 85 వార్డులకు చెందిన 49 మంది పారిశుద్య కార్మికులు, అధికారులను అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నేతలు ఘనంగా సత్కరించారు. జీవీఎంసీ గాజువాక జోన్ ఏఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, జోనల్ శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్యతో పాటు 49 మంది పారిశుద్య కార్మికులు పది రోజుల పాటు సేవలు అందించి వచ్చారు. ఈ సందర్భంగా అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామ అప్పారావు మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాల్లో సేవలందించిన కార్మికులను గుర్తించడం సంతోషకరమన్నారు. వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్ కార్మికులు, అధికారులను సత్కరించారు. ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు, కె.హనుమంతరావు, పి.కొండలరావు, జి.నరసింగరావు, బి.ఈశ్వరరావు, గవర నరసింహారావు, విందుల వరహాలు, పి.నరేష్, జి.వరలక్ష్మి పాల్గొన్నారు.